**ఆకాశవాణి విజయవాడ కేంద్రం**

**ప్రాంతీయవార్తా విభాగం 16-05-2012, గం॥ 13.20 ని॥**

# హెడ్‌లైన్స్

1. రాష్ట్రంలో వచ్చేనెల 12న జరిగే ఉప ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ అవుతుందని రాష్ట్ర ఎన్నికల ముఖ్య అధికారి భన్వర్‌లాల్ చెప్పారు.
2. జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం నిధులతో రాష్ట్రంలో శిశు మరణాలు తగ్గించడానికి రాష్ట్ర ప్రభుత్వం కొత్త మార్గదర్శకాలు విడుదల చేసింది.
3. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చేనెల ఏడవతేదీ నుంచి జూలై 28వ తేదీ వరకు జాబ్‌మేళా నిర్వహిస్తారు.
4. వచ్చేనెల ఒకటవ తేదీ నాటికి ఋతుపవనాలు కేరళా తీరాన్ని తాకుతాయని భారత వాతావరణ శాఖ తెలియజేసింది.

## ఎన్నికలు :

రాష్ట్రంలో వచ్చేనెల 12వ తేదీన జరిగే ఒక లోక్‌సభ, 18 శాసనసభ నియోజకవర్గాలకు ఎల్లుండి నోటిఫికేషన్ జారీ అవుతుందని రాష్ట్ర ఎన్నికల ముఖ్యఅధికారి భన్వర్‌లాల్ చెప్పారు. ఆరోజు నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అవుతుందని, 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారని ఆయన తెలిపారు. ఉప ఎన్నికలు స్వేచ్ఛగా ప్రశాంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఉప ఎన్నికల ఏర్పాట్లలో కేంద్ర ఎన్నికల కమీషనర్ హెచ్.యస్.బ్రహ్మ వచ్చే శుక్ర, శనివారాల్లో హైదరాబాద్ నుండి జిల్లాల కలెక్టర్లతో పోలీస్ సూపరింటెండెంట్‌లతో సమీక్షిస్తారని ఆయన తెలియజేశారు. ఉప ఎన్నికలు జరిగే 12 జిల్లాల్లో అంబులెన్స్‌కు 108 సేవలు, మీడియా వామనాలతో సహా అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని జిల్లా అధికార్లను ఆదేశించినట్టు భన్వర్‌లాల్ తెలిపారు. ఉప ఎన్నికల్లో అక్రమాలనివారణకు శాంతి భద్రతల పరిరక్షణకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించటానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని భన్వర్‌లాల్ విజ్ఞప్తి చేశారు.

ఎఫ్ఒసి - హైదరాబాద్

-------------

## యన్ఆర్‌హెచ్‌యమ్ :

జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం నిధులతో రాష్ట్రంలో శిశుమరణాలను తగ్గించేందుకు కొత్త మార్గదర్శకాలు విడుదల చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పంకజ్ ద్వివేది ఉత్తర్వులు జారీ చేశారు. తక్కువబరువు, పోషకామారం కొరత, ఎనీమియా వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్యను తగ్గించేందుకు రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడి కేంద్రాల్లో బుధ, శనివారలను న్యూట్రిషన్ హెల్త్ డేస్‌గా ఆయన ప్రకటించారు. చిన్నారులు, గర్భిణీల్లో ఆరోగ్యం పెంపొందించేందుకు మహిళా శిశు సంక్షేమ శాఖ, గ్రామీణ నీటి సరఫరాశాఖలతో ప్రత్యేక భాగస్వామ్యం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

డెస్క్

-------------

**ఎక్జామ్స్ :**

ఇంటర్‌మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈరోజు ప్రారంభమయ్యాయి. ఈనెల 25వ తేదీ వరకు ఈ పరీఓలు కొనసాగుతాయి. ఉదయం 8 గంటలనుంచి 11 గంటల వరకు మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరం పరీఓలు మధ్యాహ్నం 2 1/2 గంటల నుండి 5 1/2 గంటల వరకు నిర్వహిస్తున్నారు. ఈ ఉదయం ఫిజిక్స్ పేపర్ ఒన్ క్లాసికల్ లాంగ్వేజ్ పేపర్ వన్ పరీక్షలు జరిగాయి. ఇంటర్‌మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు కూడా డ్రా పద్ధతి ద్వారా ప్రశ్నాపత్రాన్ని ఎంపిక చేస్తున్నారు. ఈ మధ్యాహ్నం జరిగే రెండవ సంవత్సరం ఫిజిక్స్ పేపర్ 2, క్లాసికల్ లాంగ్వేజ్ పేపర్ 2 పరీక్షలకు సెట్ నెంబర్ 3 ప్రశ్నాపత్రాలను ఎంపిక చేసినట్లు ఇంటర్ మీడియట్ బోర్డు తెలియజేసింది.

ఇంటర్‌బోర్డు

--------------

**జాబ్‌మేళా :**

రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్టు రాష్ట్ర పారిశ్రామిక ఆర్థిక మండళ్ళ సమాఖ్య ఫ్యాప్సీ వెల్లడించింది. వచ్చేనెల 7వ తేదీ నుంచి జులై 28 వరకు జాబ్ మేళా నిర్వహిస్తారు. మొదటి రెండు రోజులు హైదరాబాద్‌లో జాబ్ మేళా నిర్వహించిన అనంతరం వచ్చేనెల 16న వరంగల్, 23న తిరుపతి, 30న విజయవాడ జులై 6-7 తేదీల్లో విశాఖపట్నంలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న చిన్న మధ్యతరగతి పరిశ్రమల్లో ఉద్యోగఖాళీలు భర్తీ చేస్తారు. సుమారు 500 పరిశ్రమలు ఈ ఉద్యోగ మేళాలో పాల్గొంటాయి.

డెస్క్

--------------

**అక్వా :**

రాష్ట్రంలో మత్స్యశాఖ అభివృద్ధికి మున్నెన్నడూ లేని విధంగా ప్రభుత్వం నిధులు కేటాయించిందని ఆ శాఖ మంత్రి పి.విశ్వరూప్ చెప్పారు. గతంలో మత్స్యశాఖ బడ్జెట్ 30 కోట్ల రూపాయలుండగా ఈ ఏడాది 234 కోట్ల రూపాయలకు పెంపు చేసినట్లు మంత్రి వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలో ఏడవ ఆక్వాటిక్ ఎగ్జిబిషన్‌ను మంత్రి నిన్న ప్రారంభించారు. రాష్ట్రంలో మత్స్యసంపద ఆశాజనకంగా ఉందని జలవ్యవసాయానికి మంచి భవిష్యత్ ఉందని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. కోనసీమలో అక్వాసాగు విస్తీర్ణాన్ని పెంచే లక్ష్యంతో అమలాపురంలో సముద్ర ఉత్పత్తులు ఎగుమతి సంస్థ ఎంటెడా కార్యాలయం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ శాసనసభ్యుడు రుద్రరాజు రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డెస్క్

--------------

**సియమ్ వోటింగ్ :**

నగరాల్లో పోలింగ్ శాతం తగ్గిపోతుండటం ప్రజాస్వామ్యంలో మంచి పరిణామం కాదని ముఖ్యమంత్రి యన్.కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఈరోజు నెల్లూరులో మేధావులతో ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటింగ్ శాతాన్ని పెంచడం పౌరుల బాధ్యత అని పేర్కొన్నారు. నెల్లూరులో 1400 కోట్ల రూపాయలతో టి.సుబ్బిరామరెడ్డి స్థాపించనున్న విద్యుత్ పరిశ్రమతో ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆర్థికమంత్రి రాంనారాయణ రెడ్డి, శాసనసభ్యులు వివేకానందరెడ్డి, శ్రీధరకృష్ణారెడ్డి, ప్రభాకరరెడ్డి తదితర్లు పాల్గొన్నారు.

డెస్క్

--------------

# బ్రేక్

## ఋతుపవనాలు :

వచ్చేనెల 1వ తేదీ కల్లా ఋతుపవనాలు కేరళతీరాన్ని తాకుతాయని, కొత్తఢిల్లీలోని భారత వాతావరణ విభాగం తెలిపింది. ఈసారి సాధారణ తేదీ కన్నా ముందుగానే దేశమంతటా వర్షాలు పడతాయని ఆ శాఖ తెలియజేసింది.

డెస్క్

--------------

## జైరాం :

ఉపాధిహామీ పథకంకింద చేసిన ఖర్చులకు గ్రామపంచాయితీలు ఇకపై నుండి తప్పనిసరిగా చార్టర్డ్ అకౌంట్ సి.ఎ. నుంచి ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాల్సిందేనని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి జై రాం రమేష్ తెలిపారు. నిన్న ఆయన రాజ్యసభలో మాట్లాడుతూ 19 లక్షల వరకు ఉపాధిహామీ నిధులు పొందే పంచాయితీలు అన్ని ఈ ధ్రువీకరణ పత్రాన్ని తీసుకోవాల్సిందేనని అన్నారు. ఇందులో 10-15 శాతం వరకు భౌతికంగా తనిఖీలు ఉంటాయని, ఈ పథకం అమలుపై కాగ్ నివేదిక నవంబరు కల్లా అందుతుందని ఆయన తెలిపారు. రాష్ట్రాలు అవినీతిని అరికట్టలేకపోతే నిధులు తగ్గిస్తామని అధికారులను మంత్రి హెచ్చరించారు.

డెస్క్

--------------

## పాఠశాల నిధులు :

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా పరిషత్ నిధులతో ఈ ఏడాది విద్యార్థులకు సురక్షితమైన మంచినీరు అందించాలనే లక్ష్యంతో 2.5 కోట్ల రూపాయలతో 590 ఆర్వో ప్లాంట్లు మంజూరుకాగా వీటిలో 200 ప్లాంట్లను ఏర్పాటు చేశామని జెడ్.పి.సి.ఇ.ఓ జి.భవానీదాస్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, హాస్టల్స్, ఆశ్రమ పాఠశాలలు, గిరిజన పాఠశాలలో వీటిని ఏర్పాటు చేయడానికి నిర్ణయించామని మరో రెండు నెలల్లో మంజూరైన అన్ని పాఠశాలల్లోను పూర్తి చేస్తామన్నారు.

డెస్క్

--------------

## నృత్యం :

రాష్ట్ర సాంస్కృతిక మండలి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో ఈనెల 26-27 తేదీల్లో అంతర్జాతీయ కూచిపూడి నృత్యోత్సవం జరగనుంది. ప్రముఖ కళాకారుల నృత్య ప్రదర్శనలతోపాటు కళాకారుల సంత్కారం నిర్వహిస్తారు.

డెస్క్

--------------

## మావోయిస్టు :

ఉగ్రవాద వ్యతిరేక జాతీయ కేంద్రం యన్‌సిటిసి ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆపరేషన్ గ్రీన్‌హంట్ నిరసిస్తూ మావోయిస్టులు ఈరోజు భారత్‌బంద్‌కు పిలుపునిచ్చారు. భారత్ బంద్‌నేపథ్యంలో ఆంధ్రా ఒరిస్సా సరిహద్దు జిల్లాల్లో పోలీసులు అప్రమత్తమయ్యారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. ఈనెల 10న గూడెం కొత్తవీధి మండలం లువ్వాసింగి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు గిరిజనుల మృతికి నిరసనగా మావోయిస్టు తూర్పు డివిజన్ పరిధిలో నిన్న జరిగిన బంద్‌తో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరక్కుండా ప్రశాంతంగా జరిగింది. బంద్ సందర్భంగా మావోయిస్టులు విధ్వంసానికి పాల్పడే దృష్ట్యా పోలీసు బలగాలు కూంబింగ్‌ను ముమ్మరం చేశాయి.

ఎఫ్‌ఒసి – విశాఖ

---

## ఏయు సెట్ :

ఆంధ్ర విశ్వవిద్యాలయం కామన్ ఎంట్రన్స్ టెస్ట్ ఏ.యు.సెట్ కౌన్సిలింగ్ తేదీలను రెక్టార్ డాక్టర్ బివిజెడి ప్రసాదరెడ్డి నిన్న ప్రకటించారు. విశాకపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం శ్రీకాకుళంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విశ్వవిద్యాలయాల్లో వాటి అనుబంధ కళాశాలల్లో పీజీ కోర్సుల కౌన్సిలింగ్ ప్రక్రియ ఈనెల 22 నుంచి ప్రారంభమవుతుందని ఆయన తెలిపారు. ముందుగా నిర్ణయించినట్టు ఈనెల 31 వ తేదీ బదులు 22 నుంచే కౌన్సిలింగ్ ప్రారంభిస్తున్నారు. ర్యాంకుల వారీ కౌన్సిలింగ్ నిర్వహించే నూతన తేదీల షెడ్యూల్‌ని విద్యార్థులకు పంపుతున్నారు.

ఎఫ్‌ఒసి – శ్రీకాకుళం

---

## విద్యాహక్కు :

విద్యాహక్కు బాలల ప్రాథమిక స్థాయి నుండే అమలు అయ్యేలా చూడాలని, ఆ బాధ్యత ప్రతి ఒక్కరిపై వుందని, యూనిసేఫ్ ప్రతినిధి సునీతబాల కృష్ణన్ అన్నారు. ఈరోజు విజయనగరంలో బాలల విద్యాహక్కు, ఒక అవగాహన అనే అంశంపై జరిగిన సదస్సులో ఆమె ముఖ్యఅతిధిగా పాల్గొని మాట్లాడుతూ పాఠశాలలకు వెళ్ళకుండా బయట ఉన్న పిల్లలను బడిమానేసిన పిల్లలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేందుకు ఆయా గ్రామాల్లో ఉన్న ప్రజలు ఒక సామాజిక కర్తవ్యంగా బాధ్యతలు స్వీకరించాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షతవహించిన జిల్లా కలెక్టర్ యమ్.వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ ఆడపిల్లలందరినీ కస్తూరిబా పాఠశాలల్లో చేర్పించాలని, వీధుల్లో తిరుగుతున్న చిన్నపిల్లలను బాలల సంరక్షణ కేంద్రంలోనూ, జిల్లా మండలస్థాయి పాఠశాలలోనూ చేర్పించాలని కోరారు. విజయనగరం జిల్లాను విద్యాహక్కు చట్టం అమల్లోనూ, నిరక్షరాస్యత నిర్మూలించి అక్షరాస్యత తీర్చిదిద్దే క్రమంలో రాష్ట్రంలో ప్రధమస్థానంలో వుంచేందుకు సంవత్సరకాలం అధికారులు, అనధికారులు, జిల్లా ప్రజలు, ఒక సంఘటితంగా కృషి చేయాలని కోరారు.

ఎఫ్‌ఒసి – విజయనగరం

.................